RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

తెలంగాణ | ఎడిటర్: చెరుకు ఉపేందర్ | సోమవారం 3 ఫిబ్రవరి 2025

సంపుటి: 2 | సంచిక: 264 | పేజీలు: 4 | వెల: రూ.5/-



## ఢిల్లీలో త్వరలో కొత్త వసంతం

మార్చి 8న మహిళల ఖాతాల్లో.. ప్రధాని మోదీ 2

# ఏడుకొండల వాడా..
# వెంకట రావణా..!
# గోవిందా గోవిందా..!

వికారాబాద్ జిల్లా వైద్య శాఖ ఉన్నతాధికారులపై వస్తున్న ఆరోపణలను నిగ్గు తేల్చేందుకు మరిన్ని ఆధారాలతో ప్రభాత సూర్యుడు దిన పత్రిక త్వరలో వరుస కథనాలతో సిద్ధంగా ఉంది.

**నిజం దాగదు.. వార్త ఆగదు.**

రాజు తలుచుకుంటే దెబ్బలకు కొదువా..! అన్న చందంగా తయారయ్యింది వికారాబాద్ జిల్లా వైద్య శాఖ. లక్షలు గుమ్మరించి ఇక్కడికి వచ్చా..రిటైర్ అయ్యేది కొద్ది రోజుల్లోనే..పెట్టిందంతా రాబట్టాలి కదా..అని జిల్లా మొత్తం దున్నుకుంటున్నారు మన వికారాబాద్ జిల్లా మెడికల్ బాస్. మన వెనుక ఆయన (జిల్లాకు చెందిన కీలక ప్రజా ప్రతినిధి) ఉండు..అడిగేటోడు లేడు..కానియ్యండి. ఆ హుకూంతోనే రెచ్చిపోతున్నారు ఆ ఇద్దరు కీలక వ్యక్తులు. జిల్లా మొత్తం జల్లెడ పట్టి వసూల్ చేస్తున్నారు. ఈ తతంగం నడపటానికి మరో బయటి వ్యక్తి దలారీ పాత్ర పోషిస్తున్నాడు. జిల్లాకు చెందిన క్యాబినేట్ ర్యాంక్ హోదాలో ఉన్న కీలక నేత పేరునడ్డం పెట్టుకొని వసూళ్ల పర్వం కొనసాగిస్తున్నారు. ఇలా వికారాబాద్ జిల్లా వైద్య శాఖలో అవినీతి రాబంధులు రాజ్యమేలుతున్నారని జిల్లా వ్యాప్తంగా ఆరోపణలు బాహాటంగానే విస్తరించాయి.

- జోరుగా వికారాబాద్ మెడికల్ బాస్ దందా
- వసూళ్లకు కేరాఫ్ వికారాబాద్ డియం & హెచ్ఓ
- పెద్దాయనకు లక్షలు పెట్టి వచ్చా ఇక్కడికి..
- మిగిలింది కొన్ని రోజుల సర్వీసే..పెట్టుబడంతా రాబట్టాలిగా..!
- డైరెక్ట్ గా సింగల్ విండో కౌంటర్ ఓపెన్
- కీలకంగా వ్యవహరిస్తున్న ఆ ముగ్గురు..?
- ఆకస్మిక తనిఖీలు.., చేయి తడవగానే శరామామూలు
- అనుమతుల పేరిట క్లినిక్‌ల సీజ్.. ఒకటి, రెండు రోజుల్లోనే 'రీ' ఓపెన్
- ఇంతలోనే మ్యాటర్ సెట్ చేస్తున్న ఆ ముగ్గురు అమాత్యులు
- డియం & హెచ్ఓ కార్యాలయం షిఫ్టింగ్ పేరిట కూడా వదలని వసూల్ దందా.. కార్యాలయ ఉద్యోగులకు తప్పని తిప్పలు

పెద్ద సారు తిరిగి వికారాబాద్ జిల్లాకు వచ్చినప్పటి నుండి నడుస్తున్న ఈ తతంగపై ఇంటెలిజెన్స్ వర్గాలు ఒక కన్నేసి పెట్టాయి. ఎప్పటికప్పుడు సమాచారాన్ని తెప్పించుకొని, ఈయనగారి వ్యవహారాన్ని పరిశీలిస్తున్నట్లు ఇంటెలిజెన్స్ వర్గాల సమాచారం. దీని వెనుక ఇంకా ఎవరైనా ఉన్నారా అన్న కోణంలో కూడా ఆరాతీస్తున్నట్లు తెలుస్తోంది.




ఇన్వెస్టిగేషన్ డెస్క్ - ప్రభాత సూర్యుడు

వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా హస్పిటల్స్ ఇబ్బడి ముబ్బడిగా వెలిశాయి. ప్రాథమిక చికిత్స కేంద్రాలకైతే ( క్లినిక్స్ ) కొదవేలేదు. పుట్లగొడుగుల్లా మొలుస్తున్నాయి. వీటిలో ఏ ఒక్క హస్పిటల్, క్లినిక్ లు కూడా నూటికి నూరు శాతం ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొనసాగేవి ఏవి కూడా ఉండవని జగమెరిగిన సత్యం. కరెక్ట్ గా దీన్ని అడ్డం పెట్టుకొని జిల్లా ..మిగతా 2లో






## కేంద్రంపై యుద్ధం ప్రకటించి రాష్ట్రానికి నిధులు సాధించాలి

**మహేశ్ కుమార్‌గౌడ్**

**బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం జరిగిందని ఆరోపిస్తూ కాంగ్రెస్ పార్టీ నిరసన**

హైదరాబాద్, (ప్రభాత సూర్యుడు): కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం జరిగిందని ఆరోపిస్తూ కాంగ్రెస్ పార్టీ నిరసన చేపట్టింది. హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై అంబేద్కర్ విగ్రహం వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమంలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్‌తో పాటు పలువురు పార్టీ నేతలు, కార్యకర్తుల పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ... సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా మోదీ సర్కార్ వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. దేశాభివృద్ధికి తెలంగాణ రాష్ట్రం ఎంతో సహాయపడుతుంటే.. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రం పట్ల వివక్ష చూపిందన్నారు. కేంద్రం వివక్షను ..మిగతా 2లో

## తెలంగాణలో కుల గణన
# సర్వే వివరాలు వెల్లడి

ఓసీల జనాభా 15.79 శాతం, మరీ బీసీలు ఎంతంటే

కులగణన అంశంపై ముగిసిన మంత్రివర్గ ఉపసంఘం సమావేశం

మంత్రి ఉత్తమ్‌కుమార్ అధ్యక్షతన సమావేశమైన సబ్‌కమిటీ

రాష్ట్రంలో కులగణనపై మంత్రివర్గ ఉపసంఘానికి అందిన నివేదిక

ముఖ్యాంశాలు వెల్లడించిన మంత్రి ఉత్తమ్

3





## కుంభమేళాకు 20 రోజుల్లోనే
# 33 కోట్ల మంది

**వసంత పంచమి వేళ మరింత రద్దీ!**

**5న ప్రయాగ్‌రాజ్‌కు ప్రధాని మోదీ**

హైదరాబాద్, (ప్రభాత సూర్యుడు): మహాకుంభమేళా నేపథ్యంలో వసంత పంచమి నాడు త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు భక్తులు పోటెత్తుతున్నారు. మౌని అమావాస్య రోజున చోటుచేసుకున్న తొక్కిసలాటతో అప్రమత్తమైన యూపీ సర్కార్.. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేస్తోంది. ఎటువంటి తప్పిదం లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించి ప్రభుత్వం.. సీనియర్ ఐఏఎస్‌లను రంగంలోకి దింపింది. జనవరి 13న ..మిగతా 2లో

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com



## లోక్‌సభకు 903 కోట్లు.. రాజ్యసభకు 413 కోట్లు

న్యూఢిల్లీ, (ప్రభాత సూర్యుడు): కేంద్ర బడ్జెట్‌లో లోక్‌సభకు రూ.903 కోట్లు, రాజ్యసభకు 413 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. లోక్‌సభకు కేటాయించిన నిధుల్లో 558.81 కోట్లను లోక్‌సభ సచివాలయానికి, 338.79 కోట్లు సభ్యుల కోసం ఇచ్చారు. ఇందులో సన్‌సద్ టీవీకి కేటాయించిన నిధులూ ఉన్నాయి. రాజ్యసభకు ప్రకటించిన 413 కోట్లలో 2.52 కోట్లు చైర్మన్, డిప్యూటీ చైర్మన్ల అలవెన్స్‌లు, జీతాల కోసం కేటాయించారు. వేరుగా కేటాయించిన రూ.3 కోట్లను రాజ్యసభ విపక్ష నేత జీతాలు, అలవెన్స్‌లు, సచివాలయ నిర్వహణకు, రూ.98.84 కోట్లను సభ్యులకు కేటాయించారు. లోక్‌సభ విషయానికొస్తే 1.56 కోట్లను స్పీకర్, డిప్యూటీ స్పీకర్ల జీతాలు, అలవెన్స్‌ల కోసం కేటాయించారు.



## ఢిల్లీలో త్వరలో కొత్త వసంతం

### మార్చి 8న మహిళల ఖాతాల్లో.. ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, (ప్రభాత సూర్యుడు): ఢిల్లీలో త్వరలో కొత్త వసంతం రాబోతున్నదని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. ఈసారి ఢిల్లీలో బీజేపీదే అధికారమని ఆయన చెప్పారు. ఫిబ్రవరి 8న బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని, మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళల ఖాతాల్లో రూ.2,500 చొప్పున పడుతాయని హామీ ఇచ్చారు. ఆర్కే పురం ఎన్నికల ప్రచార సభలో పాల్గొన్న ప్రధాని మోదీ.. ఆప్ ప్రభుత్వం అసత్యాలు ప్రచారం చేస్తోందని విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ఢిల్లీలో ఏ ఒక్క గుడిసెను తొలగించబోమని, సంక్షేమ పథకాలను రద్దు చేయబోమని, అన్ని సంక్షేమ పథకాలను కొనసాగిస్తామని ప్రధాని స్పష్టంచేశారు. ఆరోగ్య రంగంలోనూ 'ఆపద' ప్రభుత్వం అవినీతికి పాల్పడిందని, ప్రజలను దోచుకున్నవారు తిరిగి ఇచ్చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత నెహ్రూ హయాంలో రూ.12 లక్షల ఆదాయం ఉంటే నాల్గో వంతు వేతనాన్ని ప్రభుత్వం ట్యాక్స్ రూపంలో వెనక్కి తీసుకునేదని, ఇందిర హయాంలో అయితే రూ.12లక్షల ఆదాయంపై దాదాపు రూ.10 లక్షలు ట్యాక్స్ రూపంలో పోయేవని ఆయన గుర్తుచేశారు. పదిపన్నేండేళ్లకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వంలో రూ.12 లక్షలు సంపాదిస్తే రూ.2.60 లక్షలు ట్యాక్స్ రూపంలో ఇవ్వాల్సి వచ్చేదని, బీజేపీ తాజా బడ్జెట్ తర్వాత ఏడాదికి రూ.12 లక్షలు సంపాదించేవారు కూడా ఒక్క రూపాయి పన్ను కట్టాల్సిన అవసరం లేదని ప్రధాని చెప్పారు. సోమవారం వసంత పంచమి వస్తోందని, ఆ తర్వాత వాతావరణంలో మార్పు ప్రారంభమవుతుందని అన్నారు. ఫిబ్రవరి 5న ఢిల్లీలో అభివృద్ధికి సంబంధించిన కొత్త వసంతం రానుందని చెప్పారు. ఢిల్లీలో ఓటింగ్‌కు ముందే చీపురు పుల్లలు ఒక్కొక్కటి ఊడిపోతున్నాయని, ఆప్ నాయకులు ఆ పార్టీని వదిలి వెళ్తున్నారని అన్నారు.




## మళ్లీ మాదే విజయం

### ఓటమి భయంతో బీజేపీ గూండాయిజం : కేజ్రీవాల్

న్యూఢిల్లీ, (ప్రభాత సూర్యుడు): ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలలో మళ్లీ విజయం తమదేనని ఆప్ కన్వీనర్ అర్వింద్ కేజ్రీవాల్ అన్నారు. ఆప్ చారిత్రాత్మక విజయం దిశగా దూసుకెళ్తుండగా.. బీజేపీ పరిస్థితి రోజురోజుకు దిగజారిపోయిందని ఎద్దేవా చేశారు. ఓటమి భయంతో బీజేపీ నేతలు ఢిల్లీలో గూండాయిజం చేస్తున్నారని ఆరోపించారు. ప్రజలపై దాడులు చేస్తున్న బీజేపీ శ్రేణులపై చర్యలు తీసుకోకుండా పోలీసులకు ఆదేశాలు వెళ్లాయని కేజ్రీవాల్ విమర్శించారు. ఢిల్లీలో ఈ విధమైన ఎన్నికలను ప్రజలు ఇంతకుముందు ఎప్పుడూ చూడలేదని కేజ్రీవాల్ అన్నారు. బీజేపీ గూండాయిజానికి వ్యతిరేకంగా అందరం ఏకం కావాల్సిన అవసరం ఉందని ఢిల్లీ ప్రజలకు పిలుపునిచ్చారు. బీజేపీ గూండాయిజాన్ని దేశం దృష్టికి తెచ్చేందుకు ప్రత్యేక హ్యాష్‌ట్యాగ్‌ను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. బీజేపీ లేదా అధికార యంత్రాంగం దాడులు చేసినా, వేధింపులకు గురిచేసినా ఈ హ్యాష్‌ట్యాగ్ ద్వారా సమాచారం ఇవ్వాలని కేజ్రీవాల్ కోరారు. మీకు జరగకపోయినా ఏదైనా ఘటన మీ దృష్టికి వస్తే 'అమిత్ షా గుండాగిరి హ్యాష్‌ట్యాగ్'ను వాడి తమకు సమాచారం ఇవ్వాలని కేజ్రీవాల్ సూచించారు. పోలీసులు మీతో తప్పుగా వ్యవహరించినా, అధికారులు లేదా బీజేపీ నేతలు మిమ్మల్ని వేధింపులకు గురిచేసినా హ్యాష్‌ట్యాగ్ ద్వారా తెలియజేయాలన్నారు. అమిత్‌షా ఢిల్లీ ప్రజలపై ఏ విధంగా గూండాగిరి చేస్తున్నరో దేశం మొత్తం చూస్తున్నదని వ్యాఖ్యానించారు. బీజేపీ మనలను భయపెట్టడానికి ఎన్ని ప్రయత్నాలు చేసినా మనం బెదరవద్దని సూచించారు. అంతేగాక, ఢిల్లీ ఎన్నికలకు ముందు మురికివాడల్లో నివసించే, ఆర్థికంగా బలహీనులైన వర్గాల వారి ఓటు హక్కును తొలగించడానికి పెద్ద కుట్ర జరుగుతోందని అర్వింద్ కేజ్రీవాల్ ఆరోపించారు. అంతేకాదు సర్వెంట్ క్వార్టర్స్, ధోబీ ఘాట్లు, మురికివాడల్లో నివసించేవారి నుంచి తనకు చాలా కాల్స్ వస్తున్నాయని, ఓటర్లకు రూ.3000 చొప్పున ఇస్తున్నారని ఆయన అన్నారు.

## తిరుపతి తొక్కిసలాట ఘటనపై న్యాయ విచారణ

### హాజరైన టీటీడీ ఈవో, ఎస్పీ

తిరుమల, (ప్రభాత సూర్యుడు): తిరుమల శ్రీవారి వైకుంఠ ద్వార సర్వదర్శన టోకెన్ల జారీలో తిరుపతిలో జరిగిన తొక్కిసలాట ఘటనపై న్యాయ విచారణ ముగిసింది. హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ సత్యనారాయణమూర్తితో పాటు పలువురు సభ్యులతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ తిరుపతి కలెక్టరేట్‌లో విచారణ జరిపింది. టీటీడీ ఈవో శ్యామలరావు, పలువురు పోలీస్ అధికారులను కమిటీ విచారించింది. జ్యుడీషియల్ ఎంక్వయిరీలో భాగంగా మూడు రోజులుగా తిరుపతిలో కమిటీ పర్యటించింది. నగరంలోని తొక్కిసలాట జరిగిన పద్మావతి పార్క్, రామానాయుడు పబ్లిక్ స్కూల్ ప్రాంతాలను శనివారం పరిశీలించి ఘటనకు గల కారణాలను అడిగి తెలుసుకుంది. ఎనిమిది ప్రాంతాల్లో ఏకాదశి టికెట్లు మంజూరు చేసిన విధానంపై ఆరా తీసింది. విచారణ నేపథ్యంలో కమిటీ పలు దస్త్రాలను సేకరించింది. త్వరలోనే ప్రభుత్వానికి కమిటీ నివేదిక అందజేయనుంది.

## ఏడుకొండల వాడా.. వెంకట రావణా..! గోవిందా గోవిందా..!



మొదటి పేజీ తరువాయి...

వైద్య శాఖ బిగ్ బాస్ వెంకట రావణ విచ్చలవిడిగా రెచ్చిపోయి చేతివాటం ప్రదర్శిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. తనిఖీల పేరిట హస్పిటల్స్, క్లినిక్స్ లపై హల్చల్ చేసి..చేతులు తడవగానే సైలెంటైపోతున్నారు. చివరకు జిల్లా వైద్య శాఖలోని తోటి ఉద్యోగులను కూడా ట్రాన్స్ఫర్లు, సస్పెండ్లంటూ వదలడం లేదని కొందరు ఉద్యోగులు గోడువెల్లబోసుకుంటున్నారు. ఈ మద్యకాలంలోనే జిల్లాలోని పరిగి పట్టణ కేంద్రంలోని గ్లోబల్ క్లినిక్ ను అధికారులు సీజ్ చేయగా, తిరిగి రెండు రోజుల్లోనే క్లినిక్ రీ ఓపెన్ అయ్యిందటే వ్యవహారం ఏ స్థాయిలో నడుస్తుందో ఇట్టే అర్థమవుతుంది. లక్షలు దండుకొని ఆర్ఎంపీ లను యంబీబీఎస్ డాక్టర్స్ గా చలమని చేయిస్తున్నారనే విమర్శలు కూడా వినపిస్తున్నాయి.

### ఆ ముగ్గురిదే కీలక పాత్ర..

జిల్లా వెట్కద్య యంత్రాంగంలో డిప్యూటీ డీయంహెచ్ఓ జీవరాజ్, డెమో శ్రీను, మరో ఆర్ఎంపి వైద్యుడు ఆనంద్, ముగ్గురు కూడా బిగ్ బాస్ దందాలో కీలకంగా వ్యవహరిస్తున్నారని గుసగుసలు వినిపిస్తున్నాయి. తనిఖీలు ఎక్కడ, ఎవ్వరిపై అనేది ఒకరి ప్లాన్.. తనఖీలు చేసేది



పరిగి పట్టణ కేంద్రంలోని అనధికార క్లినిక్‌ను సీజ్ చేస్తున్న అధికారులు (ఫైల్ ఫోటో)




సీజ్ చేసిన రెండు రోజుల్లోనే తెరుచుకుంటున్న అక్రమ క్లినిక్‌లు (ఫైల్ ఫోటో)

మరోకరు.. సెటిల్ చేసేది వేరోకరు. ఈ తరహాలో పద్ధతి ప్రకారం నడుస్తుంది వ్యవహారం. డైరెక్టుగా సింగల్ విండో కౌంటర్ ఓపెన్ చేసి మరి తతంగం నడిపిస్తున్నారు ఆ ముగ్గురు త్రయులు. క్లినిక్ లు నడవాలన్నా, అనుమతులు కావాలన్నా, డాక్టర్ గా చలామని కావాలన్నా, వైద్య శాఖలో ఏ ఫైల్ ముందుకు సాగాలన్నా అంతా పెత్తనం వారిదే. ఎవ్వరిని వదిలేది ఉండదని తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### లక్షలు పెట్టి వచ్చా..రాబట్టాలిగా..

లక్షల రూపాయలు ధారపోసి ఇక్కడికి బదిలీ చేసుకొని వచ్చా..రిటైర్మంట్ దగ్గర పడుతుంది..పెట్టిందంతా ఇప్పుడే రాబట్టాలి. .అంటూ మన వెంకట రావణుడు ఏకంగా జిల్లాకు చెందిన కీలక పదవిలో ఉన్న ప్రజా ప్రతినిధిని బద్నాం చేసున్నాడని ఆ ప్రతినిధి ఫాలోవర్స్ ఆగ్రహంతో ఊగిపోతున్నారు. ఈ అంశంపై ఆ ప్రతినిధి సీరియస్ గా ఉన్నట్లు తెలుస్తోంది.

### తోటి ఉద్యోగులకూ..తప్పని తిప్పలు

ఎవ్వరినీ వదిలేది లేదు. సార్ దాహర్తికి తోటి ఉద్యోగులు కూడా విలవిలా కొట్టుకుంటున్నారు. జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధి అండదండలు మెండుగా ఉన్నాయంట.. ఏకంగా జిల్లా వైద్య శాఖలోని ఉద్యోగులను కూడ భయభ్రాంతులకు గురిచేసి కాసులు దండుకుంటున్నాడని ఆరోపణలు వినిపిస్తున్నాయి. చెప్పినట్లు వినకపోతే కలెక్టర్ పేరుతో ట్రాన్స్ఫర్, సస్పెండ్లంటూ వేధింపులకు గురిచేసి పైకం వసూల్ చేస్తున్నారని సొంత కార్యాలయంలో ఆరోపిస్తున్నారు కొందరు జిల్లా వైద్య శాఖ ఉద్యోగులు.

### ఆఫీస్ షిఫ్టింగ్ లో కూడా చేతివాటం

రాజకీయ పలుకుబడితో అయ్యగారి వ్యవహర శైలి పీక్స్ కు చేరుతుండటంతో కలెక్టర్ కూడా ఎటాంటి చర్యలు తీసుకోలేని పరిస్థితి నెలకొందని విమర్శలు వినిపిస్తున్నాయి. ఆయన అవనీతికి అడ్డుకట్ట వేసేందుకు అనంతగిరిలో ప్రస్తుతం కొనసాగుతున్న డీయం & హెచ్ఓ కార్యాలయాన్ని సమీకృత జిల్లా కలెక్టర్ కార్యాలయ సముదాయంలోకి మర్చాలని కలెక్టర్ ఆదేశాలు జారీచేసారు. దీన్ని కూడా తనకు అనుకూలంగా మార్చుకొని కొత్త రకం వసూలుకు తెరలేపాడు వెంకట రావణ. ఆఫీస్ షిఫ్టింగ్ చార్జెస్ పేరిట కూడా రావణుడు జోరుగా వసూళ్ళు చేసున్నాడని గుసగులు వినిపిస్తున్నాయి. హెూదాను బట్టి రేటు డిసైడ్ చేశారంట. జిల్లా వైద్య శాఖ కార్యాలయంలోని ప్రోగ్రామ్ అధికారులకు 20 వేలు, గజిటెడ్ అధికారులకు 10 వేలు, నాన్ గజిటెడ్ అధికారులకు 5 వేలు, క్రింది స్థాయి ఉద్యోగులకైతే 2 వేలు. అదేవిధంగా జిల్లాలోని ఒక్కో పీసీహెచ్ కు 25 వేల చొప్పున వసూల్ చేస్తున్నారని, దీన్నంతటిని ఒక మహిళా అధికారిని పవిత్ర, మాస్ మీడియా డెమో శ్రీను దగ్గరుండి మరీ పెద్ద సారుకు సహకరిస్తున్నట్లు విశ్వసనీయం సమాచారం. వారడిగిన డిమాండును నిరాకరిస్తే ఎప్పటిలాగానే ట్రాన్స్ఫర్, సస్పెండ్లంటూ బెదిరింపులు. వికారాబార్ డియం & హెచ్ఓలో దర్జాగా జరుగుతున్న ఈ అవినీతికి అడ్డుకట్ట పడేదెలానో, జిల్లా కలెక్టర్ ఎలాంటి చర్యలు తీసుకుంటాడో వేచి చూడాలి మరి.

## కేంద్రంపై యుద్ధం ప్రకటించి రాష్ట్రానికి నిధులు సాధించాలి



మొదటి పేజీ తరువాయి...

ప్రజాక్షేత్రంలోనే ఎండగట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో చేపడుతున్న వివిధ ప్రాజెక్టులకు సాయం చేయాలని పలుసార్లు కేంద్రానికి నివేదికలు ఇచ్చినా పట్టించుకోలేదన్నారు. " నిధుల కేటాయింపుల్లో రాష్ట్రానికి ఏటా అన్యాయం జరుగుతోంది. జీడీపీలో రాష్ట్ర వాటా 5 శాతం ఉన్నా తెలంగాణకు ఎప్పుడూ మొండిచేయే. కేంద్రంపై యుద్ధం ప్రకటించి రాష్ట్రానికి నిధులు సాధించాలి. అన్ని పార్టీలు ఏకమై కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలి. కేంద్రంపై పోరాటానికి భారాస కూడా కలిసి రావాలి" అని మహేశ్ కుమార్‌గౌడ్ అన్నారు. కేంద్ర ప్రభుత్వ వివక్షతను రాష్ట్ర ప్రజలంతా ఖండించాలని మంత్రి సీతక్క కోరారు. మంత్రి పొన్నం ప్రభాకర్, సీనియర్ నేతలు షబ్బీర్ అలీ, చిన్నారెడ్డి తదితరులు నిరసనలో పాల్గొన్నారు.


## కుంభమేళాకు 20 రోజుల్లోనే 33 కోట్ల మంది

మొదటి పేజీ తరువాయి...

కుంభమేళా ప్రారంభం కాగా.. ఫిబ్రవరి 1వ తేదీ వరకు ప్రయాగ్‌రాజ్‌లో సుమారు 33కోట్ల మంది పుణ్యస్నానాలు ఆచరించినట్లు యూపీ ప్రభుత్వం అంచనా వేసింది. శనివారం 2.15కోట్ల మంది రాగా.. ఆదివారం మధ్యాహ్నం 12గంటల వరకే 90లక్షల మంది భక్తులు స్నానాలు ఆచరించినట్లు తెలిపింది. వసంత పంచమి పురస్కరించుకొని సోమవారం 4 నుంచి 6కోట్ల మంది రానున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. మరోవైపు కుంభమేళాకు ప్రముఖుల తాకిడి కూడా పెరుగుతోంది. వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు ఇప్పటికే ప్రయాగ్‌రాజ్‌కు వచ్చివెళ్లగా.. ఫిబ్రవరి 5న ప్రధాని మోదీ రాక కోసం ఏర్పాట్లు చేస్తున్నారు.

### అమెరికా జనాభాతో సమానంగా యాత్రికులు

మౌని అమావాస్య రోజున కోట్లాది మంది ప్రయాగ్‌రాజ్ రావడం, సెక్టార్ 2లో జరిగిన తొక్కిసలాటలో 30 మంది చనిపోయిన నేపథ్యంలో క్రౌడ్ మేనేజిమెంట్‌పై అధికారులు మరింత దృష్టి సారించారు. 2019లో అర్ధ కుంభమేళా సమయంలో పనిచేసిన ఐఏఎస్ అధికారులు ఆశీష్ గోయల్, భానుచంద్ర గోస్వామిలను రంగంలోకి దించారు. వీరిద్దరు మేళా అధికారి విజయ్ కిరణ్ ఆనంద్‌తో కలిసి పని చేయనున్నారు.



అదనపు డీజీపీ భాను భాస్కర్ కూడా రద్దీ నియంత్రణ చర్యలను పర్యవేక్షిస్తున్నారు. ఆదివారం ఘాట్‌లను పరిశీలించిన ఆయన.. స్నానాల తర్వాత ఘాట్‌ల వద్ద కాలక్షేపం చేయవద్దని సూచించారు. ఇతరుల కోసం ఆ ప్రదేశాన్ని ఖాళీ చేయాలని, ఘాట్‌ల వద్ద భోజనాలు చేయవద్దని చెబుతున్నారు. విశ్రాంతి కోసం భక్తులు నిర్దేశించిన ప్రాంతాలకు వెళ్లాలని మైక్‌లలో ప్రకటనలు చేశారు. ఇదిలాఉంటే, కుంభమేళా సమయంలో సంక్రాంతి, మౌని అమావాస్య, వసంత పంచమిలను పవిత్ర రోజులుగా భావిస్తారు. వీటితోపాటు మాఘ పూర్ణిమ (ఫిబ్రవరి 12), మహా శివరాత్రి (ఫిబ్రవరి 26) రోజుల్లోనూ అమృత స్నానం ఆచరించేందుకు కోట్లాది మంది భక్తులు ప్రయాగ్‌రాజ్‌కు వచ్చే అవకాశం ఉంది.



## వైఎస్ షర్మిలతో సీక్రెట్‌గా విజయసాయి రెడ్డి భేటీ

### వైసీపీలో మొదలైన కంగారు

అమరావతి, (ప్రభాత సూర్యుడు): ఏపీ రాజకీయాల్లో ఊహించని పరిణామం చోటుచేసుకుంది. రాజకీయాల నుంచి తప్పుకొని వ్యవసాయం చేస్తానని ప్రకటించిన విజయసాయిరెడ్డి.. ఏపీ కాంగ్రెస్ ఛీఫ్ వైఎస్ షర్మిలతో మూడు రోజుల క్రితం సీక్రెట్‌గా సమావేశమైనట్లు తెలుస్తోంది. జగన్‌కు అత్యంత సన్నిహితుడిగా పేరున్న విజయసాయి రెడ్డి.. షర్మిలను కలిశారనే విషయం ఇప్పుడు వైసీపీలో కలకలం రేపింది. మూడు రోజుల క్రితం విజయసాయిరెడ్డి హైదరాబాద్ వెళ్లి.. లోటస్‌పాండ్‌లోని షర్మిలను సీక్రెట్‌గా కలిశారని ఒక వార్త బయటకొచ్చింది. దాదాపు 3 గంటల పాటు రాజకీయ అంశాలపై వారిద్దరూ రాజకీయ అంశాలపై చర్చించారని సమాచారం. అంతేకాదు మధ్యాహ్నం భోజనం కూడా షర్మిల ఇంట్లోనే చేశారని తెలుస్తోంది. ఎంత సీక్రెట్‌గా వీళ్ల భేటీ జరిగినప్పటికీ.. ఏదోలా ఈ విషయం ఇప్పుడు బయటకు పొక్కింది. దీంతో ఏపీ రాజకీయాల్లో ఏం జరుగుతుందని వైసీపీ శ్రేణులతో పాటు మిగతా పార్టీలు ఆశ్చర్యపోయి చూస్తున్నాయి. జగన్‌కు అత్యంత సన్నిహితుడిగా ఉన్న విజయసాయిరెడ్డి.. అన్ని వేళలా ఆయనకు అండగా ఉన్నారు. గతంలో అన్నాచెల్లెళ్ల మధ్య ఆస్తుల వివాదం తలెత్తినప్పుడు కూడా జగన్‌కు మద్దతిస్తూ.. షర్మిలతో విబేధించారు. అది కాకుండా వైఎస్ వివేకానంద రెడ్డి గుండెపోటుతో మరణించారని విజయసాయి చేసిన ప్రకటనపైనా అభ్యంతరం తెలిపారు. వైఎస్ వివేకా హత్య కేసులో నిజాలు బయటపెట్టాలని కూడా షర్మిల సూచించారు. షర్మిలపై విజయసాయి కూడా పలు సందర్భాల్లో విమర్శలు చేశారు. ఇలా ముందు నుంచి విబేధాలతో ఉన్న వీరు.. ఇప్పుడు భేటీ అవ్వడం రాజకీయ వర్గాల్లో చర్చలకు తావిస్తోంది.

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

# హైకోర్టు బెంచ్ భవనం ఎంపిక కోసం కర్నూలులో పర్యటించనున్న హైకోర్టు జడ్జిలు

**న్యూఢిల్లీ, (ప్రభాత సూర్యుడు):** కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటులో కీలక పరిణామం చోటుచేసుకుంది. బెంచ్‌కు అనువైన భవనాన్ని ఎంపిక చేసేందుకు ఈ నెల 6న హైకోర్టు జడ్జిల బృందం కర్నూలుకు వెళ్లనుంది. దిన్నెదేవరపాడు వద్ద విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్‌కు చెందిన భవనాన్ని వారు పరిశీలించనున్నట్లు రాష్ట్ర న్యాయశాఖ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి %చీవీణ% ఫరూక్ తెలిపారు. నంద్యాలలో ఆయన మీడియాతో మాట్లాడారు. బెంచ్ ఏర్పాటుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి వివరించారు. కలెక్టర్‌కు హైకోర్టు రిజిస్ట్రార్ లేఖ : అయితే కర్నూలులో శాశ్వత హైకోర్టు బెంచ్ ఏర్పాటు కోసం 15 మంది న్యాయమూర్తులకు సరిపడా సౌకర్యాలకు సంబంధించిన పూర్తి వివరాలు సమర్పించాలని హైకోర్టు రిజిస్ట్రార్ గత నెల జనవరి 29న కర్నూలు జిల్లా కలెక్టర్ రంజిత్ బాషాకు లేఖ రాసిన విషయం తెలిసిందే. 15 మంది న్యాయమూర్తులకు సరిపడా మౌలిక సదుపాయాలు, కోర్టు కాంప్లెక్స్, కోర్టు గదులు, సిబ్బంది గదులు, న్యాయవాదులకు వసతి, న్యాయమూర్తులు, కోర్టు సిబ్బందికి నివాస, వసతి సౌకర్యాల పూర్తి సమాచారాన్ని జనవరి 30లోపు తమ ముందు ఉంచాలని, ఈ వ్యవహారాన్ని అత్యవసరంగా భావించాలని కలెక్టర్‌కు రాసిన లేఖలో రిజిస్ట్రార్ పేర్కొన్నారు. అక్కడ సౌకర్యాలు ఉన్నాయా ?లేవా? : ఈ వివరాలను హైకోర్టు న్యాయమూర్తుల కమిటీ ముందు ఉంచాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు. ఈ లేఖపై వెంటనే స్పందించిన కర్నూలు కలెక్టర్ రంజిత్ బాషా రహదారులు, భవనాలశాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, ఆర్డీవోలకు లేఖ రాశారు. హైకోర్టు కోరిన సౌకర్యాలతో ప్రభుత్వ/ప్రైవేటు భవనాలు ఉన్నాయా ?లేవా? అనే విషయాన్ని పరిశీలించి నివేదిక ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ ఖాళీ భూములను గుర్తించి ఈ నెల 30లోపు నివేదిక ఇవ్వాలని కర్నూలు ఆర్డీవోకు స్పష్టం చేశారు.

## తెలంగాణలో కుల గణన

# సర్వే వివరాలు వెల్లడి



**హైదరాబాద్, (ప్రభాత సూర్యుడు):** వెనుకబడిన తరగతులకు న్యాయం చేయాలన్నదే తమ ఆకాంక్ష అని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ప్లానింగ్ డిపార్ట్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ సుల్తానియా రాష్ట్రంలో కులగణన అంశంపై కేబినెట్ సబ్ కమిటీకి(మంత్రివర్గ ఉపసంఘం) నివేదిక అందజేశారు. కులగణనపై మంత్రివర్గ ఉపసంఘం భేటీ ముగిసిన అనంతరం ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. రాహుల్‌గాంధీ ఆశయం మేరకు రాష్ట్రంలో సామాజిక, కులగణన సర్వే చేపట్టామని ఆయన వెల్లడించారు.

### 96.9శాతం మంది వివరాలందించారు :

స్వాతంత్ర్యం పూర్వం నుంచి మనదేశంలో జనగణన జరుగుతోందని, అసలైన పేదలను గుర్తించేందుకు కులగణన మాత్రం జరగలేదని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, కులగణన చేయాలని అసెంబ్లీ తీర్మానించిందని వివరించారు. బలహీనవర్గాల అభ్యున్నతికి అవసరమైన వివరాల సేకరణకు కులగణన చేపట్టామన్న ఉత్తమ్ కుమార్ రెడ్డి సామాజిక కులగణన సర్వేలో 1,03,889 మంది ఎన్యుమరేటర్లు పాల్గొన్నారని తెలిపారు. 96.9శాతం (3.50 కోట్ల మంది) మంది సర్వేలో పాల్గొని వివరాలను అందించారని ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు. 3.1శాతం (16లక్షల మంది) వివిధ కారణాల వల్ల వివరాలు అందించలేదని తెలిపారు.

### కేబినెట్‌లో చర్చించి శాసనసభలో ప్రవేశపెడతాం :

ప్రజల సామాజిక, ఆర్థిక, రాజకీయ, ఉపాధి ఇతర అంశాలపై సమగ్ర అధ్యయనం జరిగిందని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. సర్వేను అడ్డుకోవాలని కొందరు ప్రయత్నించినా అధికారులు విజయవంతంగా పూర్తి చేశారని వివరించారు. ఈనెల 4న మంత్రివర్గం ముందు కులగణన సర్వే నివేదిక ప్రవేశపెడతాని ఆయన వెల్లడించారు. కేబినెట్‌లో చర్చించి వెంటనే శాసనసభలో ప్రవేశ పెడతామన్న ఉత్తమ్ కుమార్ రెడ్డి సమాజంలో విప్లవాత్మక మార్పు తీసుకొచ్చేందుకు ప్రభుత్వం ముందుకెళ్తోందని తెలిపారు. ఈ సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, దామోదర రాజనర్సింహ, సీతక్క తదితరులు పాల్గొన్నారు.

### కులగణన సర్వేలోని ముఖ్యాంశాలు ఇవే :

తెలంగాణ రాష్ట్రంలోని 3,54,77,554 మంది వివరాల నమోదు. మొత్తం 1,12,15,131 కుటుంబాల వివరాలు నమోదు చేశారు.

కులగణన సర్వేలో పాల్గొన్న జనాభా 96.90 శాతం మంది.

కులగణన సర్వేలో పాల్గొనని జనాభా 3.10 శాతం మంది

కులగణన సర్వే ప్రకారం తెలంగాణలో ఎస్సీల జనాభా 17.43 శాతం

ఎస్టీల జనాభా : 10.45 శాతం మంది

రాష్ట్రంలో బీసీల జనాభా : 46.25 శాతం మంది

రాష్ట్రంలో ముస్లిం మైనారిటీల బీసీల జనాభా 10.08 శాతం మంది

ముస్లిం మైనారిటీ బీసీలు సహా మొత్తం బీసీల జనాభా 56.33 శాతం

రాష్ట్రంలో ముస్లిం మైనారిటీ ఓసీల జనాభా 2.48 శాతం

రాష్ట్రంలో మొత్తం ముస్లిం మైనారిటీల జనాభా 12.56 శాతం

రాష్ట్రంలో మొత్తం ఓసీల జనాభా 15.79 శాతం



## దేశాల మధ్య

# సుంకాల యుద్ధం

### అమెరికా యాక్షన్.. కెనడా, మెక్సికో రియాక్షన్

**న్యూఢిల్లీ, (ప్రభాత సూర్యుడు):** అగ్రరాజ్యం అమెరికాకు.. కెనడా, మెక్సికో దేశాలతో సుంకాల యుద్ధం మొదలైంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కెనడా, మెక్సికో దేశాల నుంచి దిగుమతి చేసుకునే వస్తువులపై 25 శాతం సుంకాలు విధించారు. ఈ సుంకాలు ఫిబ్రవరి 1 నుంచి అమల్లోకి వచ్చాయి. ఈ నిర్ణయంపై కెనడా, మెక్సికో దేశాలు ప్రతీకార చర్యలకు దిగాయి. అందులో భాగంగా 155 బిలియన్ కెనడియన్ డాలర్ల విలువైన అమెరికా దిగుమతులపై 25% సుంకం విధిస్తునట్లు ఆ దేశ ప్రధాని జస్టిన్ ట్రూడో ప్రకటించారు. మెక్సికో కూడా అలాంటి ఆదేశాలే జారీ చేసింది. 155 బిలియన్ కెనడియన్ డాలర్ల అమెరికా దిగుమతులపై 25% టారిఫ్‌లు విధిస్తున్నామని, ట్రంప్ చర్యలకు ఇది ప్రతిస్పందన అని జస్టిన్ ట్రూడో వ్యాఖ్యానించారు. 30 బిలియన్ డాలర్ల విలువైన వస్తువులపై విధించే సుంకం ఈ మంగళవారం నుంచే అమల్లోకి వస్తుందని, మిగిలిన టారిఫ్‌లు 21 రోజుల తర్వాత అమలవుతాయని చెప్పారు. అమెరికాను స్వర్ణయుగంలా మార్చాలని ట్రంప్ అనుకుంటే తమతో భాగస్వామ్యాన్ని కోరుకోవాలని, అదే వారికి మంచిదని పేర్కొన్నారు. మెక్సికో కూడా కెనడా బాటలోనే నడుస్తోందని, తాము కూడా అమెరికా దిగుమతులపై సుంకాలు విధిస్తామని మెక్సికో అధ్యక్షురాలు క్లాడియా షేన్‌బామ్ అన్నారు. డ్రగ్స్ అక్రమ రవాణా గ్రూపులతో మెక్సికో ప్రభుత్వానికి సంబంధాలు ఉన్నాయంటూ అమెరికా చేసిన ఆరోపణలను ఆమె తీవ్రంగా ఖండించారు. తమ ప్రభుత్వం 4 నెలల్లో 20 మిలియన్ డోస్ ఫెంటనిల్ సహా 40 టన్నులకు పైగా డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకుందని, దాదాపు పదివేల మందిని అరెస్ట్ చేశామని తెలిపారు. మెక్సికో ఎల్లప్పుడూ పొరుగు దేశాలతో సహకారం కోరుకుంటుందే తప్ప ఘర్షణను కాదని అన్నారు. మాదకద్రవ్యాలను అరికట్టాలని అమెరికా ప్రభుత్వం నిర్ణయించుకుంటే అందుకు కలిసి పనిచేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, అధిక సుంకాలు విధిస్తే సమస్యలు పరిష్కారం కావని క్లాడియా వ్యాఖ్యానించారు. మెక్సికన్ ప్రజల ప్రయోజనాలకు అనుగుణంగానే తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, అందులో భాగంగా ప్లాన్-బీని అమలు చేయాలని ఆర్థిక కార్యదర్శిని ఆదేశిస్తున్నానని షేన్‌బామ్ తన అధికారిక ఎక్స్ ఖాతాలో రాసుకొచ్చారు. మరోవైపు చైనాపై సుంకాలు విధించాలన్న ట్రంప్ నిర్ణయంపై చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ మండిపడింది. ప్రపంచ వాణిజ్య సంస్థ లో అమెరికా నిర్ణయాన్ని సవాలు చేస్తామని ప్రకటించింది. కెనడా, మెక్సికోపై 25 శాతం, చైనాపై 10 శాతం సుంకాలు విధిస్తూ ట్రంప్ శనివారం తీసుకున్న నిర్ణయాన్ని చైనా తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. తమ దేశ ప్రయోజనాలు, హక్కులను కాపాడుకోవడానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొంది.



## ముద్రగడ ఇంటి వద్ద

# కలకలం..

### ట్రాక్టర్‌తో వచ్చి తాగుబోతు యువకుడు బీభత్సం

### మాజీ మంత్రి ఇంటి గేటును ఢీకొట్టి ప్రవేశం

### కారు, ఫ్లెక్సీలు ధ్వంసం చేసి పరారు

**అమరావతి, (ప్రభాత సూర్యుడు):** మాజీ మంత్రి, వైఎస్ఆర్సీపీ నేత ముద్రగడ పద్మనాభరెడ్డి ఇంటి వద్ద కలకలం రేగింగి. కాకినాడ జిల్లా కిర్లంపూడిలోని ముద్రగడ నివాసంలో ఓ తాగుబోతు యువకుడు భీభత్సం సృష్టించాడు. ఆదివారం తెల్లవారుజామున గన్నిశెట్టి గంగాధర్ అనే వ్యక్తి తప్పతాగి.. ముద్రగడ ఇంటికి ట్రాక్టర్ నడుపుకుంటూ వచ్చాడు. అక్కడ కాంపౌండ్ వాల్ గేటు ట్రాక్టర్‌తో ఢీకొట్టి లోపలికి వెళ్లాడు. అనంతరం పార్కింగ్ చేసిన కారుతో పాటు ఫ్లెక్సీలను ఢీకొట్టి ధ్వంసం చేశాడు. జై జనసేన అంటూ అతడు నినాదాలు చేశారు. అనంతరం గేటును ఢీకొట్టాడు. ర్యాంప్ వద్ద ఉన్న కారును ఢీకొట్టడంతో భారీ శబ్దానికి ముద్రగడ ఇంటిలోని ఉండే పనివాళ్లు, వ్యక్తులు మేల్కొనడంతో అతడు అక్కడ నుంచి పరారయ్యాడు. మరోవైపు, దీని గురించి సమాచారం అందుకున్న పోలీసులు.. హుటాహుటిన ముద్రగడ నివాసానికి చేరుకున్నారు. అక్కడ ఏర్పాటుచేసిన సీసీటీవీ కెమెరా ఫుటేజ్‌లను పరిశీలించారు. వీటి ఆధారంగా నిందితుడ్ని జగపతి నగరానికి చెందిన యువకుడు గంగాధర్‌గా గుర్తించి.. అతడ్ని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదుచేసిన పోలీసులు.. విచారణ చేస్తున్నారు. అతడి చర్యల వెనుక ఎవరైనా ఉన్నారా?. లేక గంగాధర్ తనకు తానుగా ఇలా చేశాడా? అన్న దానిపై కూడా ఆరా తీస్తున్నారు. తమ నాయకుడి నివాసం వద్ద తాగుబోతు వీరంగం వేసిన విషయం తెలుసుకున్న ముద్రగడ అనుచరులు.. భారీగా చేరుకున్నారు. దాడికి పాల్పడిన వ్యక్తిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో అక్కడ స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఘటన గురించి పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది. ఆ పార్టీకి చెందిన ముఖ్య నేతలు ముద్రగడ నివాసానికి వచ్చి.. పరిస్థితి గురించి ఆరా తీశారు. కాగా, ఇటీవలే ముద్రగడ పద్మనాభం రెడ్డి కుమారుడు ముద్రగడ గిరికి మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి కీలక బాధ్యతల్ని అప్పగించారు.. ఆయనను కాకినాడ జిల్లా ప్రత్తిపాడు అసెంబ్లీ నియోజకవర్గ కో-ఆర్డినేటర్‌గా నియమించారు. అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాలతో గిరికి ఈ బాధ్యతలు అప్పగించినట్లు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది.

# పాతవి రావు.. కొత్తవీ లేవు



### బడ్జెట్‌లో రాష్ట్రానికి మళ్లీ నిరాశే

### రాష్ట్ర ప్రభుత్వ విన్నపాలు గాలికి..

### ప్రాధాన్య ప్రాజెక్టులకూ రిక్తహస్తం

**హైదరాబాద్, (ప్రభాత సూర్యుడు):** కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో తెలంగాణకు మొండిచేయి చూపింది. రాష్ట్రానికి సంబంధించిన ఏ ఒక్క పథకానికి గానీ, ప్రాజెక్టుకు గానీ బడ్జెట్‌లో చోటు దక్కలేదు. రాష్ట్ర ప్రభుత్వం పలు ప్రాజెక్టుల కోసం ప్రతిపాదనలిచ్చినా, ఫలితం కనిపించలేదు. రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రులు ఇచ్చిన వినతులపైనా స్పందించలేదు. కొత్త ప్రాజెక్టులు, కార్యక్రమాల్లోనూ రాష్ట్రానికి చోటు దక్కలేదు. కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగంలో మరోసారి 'తెలంగాణ' పదం వినిపించకుండా పోయిందని రాష్ట్రంలో అధికార కాంగ్రెస్ పార్టీతో పాటు ప్రధాన ప్రతిపక్షం భారాస తీవ్రస్థాయిలో ధ్వజమెత్తాయి.

### అన్నీ పెండింగే

విభజన హామీలకు సంబంధించిన ప్రతిపాదనలు దీర్ఘకాలంగా పెండింగులో ఉన్నాయి. బయ్యారం ఉక్కు కర్మాగారం, ఐఐఎం వంటి ఉన్నత విద్యాసంస్థల ఏర్పాటు వంటివి.. ఈ జాబితాలో ఉన్నాయి. ప్రధానంగా మహబూబాబాద్ జిల్లా బయ్యారంలో భారీ ఉక్కు కర్మాగారం నిర్మించాలని రాష్ట్రం కోరుతోంది. దీనిపై వివిధ ప్రతిపాదనలున్నా.. ఇప్పటి వరకు మంజూరు కాలేదు. కాజీపేటలో రైల్వే కోచ్‌ల తయారీ కర్మాగారంపైనా అధికారిక ప్రకటన వెలువడలేదు. గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించినా.. పూర్తిస్థాయిలో కార్యరూపం దాల్చలేదు. ఏళ్ల తరబడి డిమాండ్ల మేరకు పసుపు బోర్డు ఏర్పాటు చేసినా, బడ్జెట్లో దానికి నిధులు కేటాయించకపోవడం గమనార్హం. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా, నవోదయ కళాశాలలు, సైనిక పాఠశాలలతో పాటు కొత్త వైద్యకళాశాలల ఏర్పాటుపైనా కేంద్రం నుంచి స్పందన లేదు. రాష్ట్ర ప్రభుత్వం వివిధ అభివృద్ధి ప్రాజెక్టులను చేపట్టేందుకు సన్నద్ధమవుతోంది. వీటికి భారీగా నిధులు అవసరమవుతాయని, కేంద్రం సాయం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా దిల్లీకి వెళ్లి ప్రధానమంత్రి నరేంద్రమోదీ, హోంశాఖ మంత్రి అమిత్‌షా, ఇతర కేంద్రమంత్రులకు వినతిపత్రాలు సమర్పించారు. సీఎం, ఆయా శాఖల మంత్రులు కేంద్రానికి లేఖలు రాసి గుర్తుకు తెస్తున్నారు. ఆయా శాఖల కార్యదర్శులు, డైరెక్టర్లు సైతం దిల్లీకి వెళ్లి కేంద్ర కార్యదర్శులను కలుస్తున్నారు.. అయినా కేంద్రం నుంచి స్పందన లేదు.

### నిధులు తక్షణావసరమైనా..

కేంద్ర బడ్జెట్‌కు ముందు ప్రతిసారీ పెండింగు, కొత్త ప్రాజెక్టులు, ఇతర ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వం గుర్తు చేస్తోంది. రీజినల్ రింగ్ రోడ్, రేడియల్ రోడ్లు, మూసీ పునరుజ్జీవ పథకం సహా తొమ్మిది ప్రాజెక్టులకు రూ. 1.63 లక్షల కోట్లు కావాలని కేంద్రాన్ని కోరింది. ఇంకా సెమీకండక్టర్ మిషన్, సింగరేణికి కొత్త బొగ్గు గనులు కావాలని రాష్ట్ర ప్రభుత్వం కొన్ని నెలలుగా కేంద్రాన్ని కోరుతోంది. ఈసారి కూడా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఇతర సీనియర్ అధికారులు దిల్లీకి వెళ్లి కేంద్ర క్యాబినెట్ సెక్రటరీ సహా పలువురు ఉన్నతాధికారులను కలిసి ప్రతిపాదనలు సమర్పించారు. పలు జాతీయ రహదారుల ప్రాజెక్టులకు అటవీ శాఖ అనుమతులు, విద్యుత్ బస్సుల కొనుగోలుకు రాయితీలు, ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద 20 లక్షల ఇళ్లు, విద్యుత్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీమ్, వ్యవసాయంలో సౌరవిద్యుత్ పంపుసెట్ల వినియోగానికి ప్రోత్సాహకాలు, ఫీడర్ స్థాయిలో సౌర విద్యుత్ వినియోగానికి అనుమతులు, విద్యుత్ అభివృద్ధి నిధి తదితరాలు కావాలని విన్నవించారు. పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ వడ్డీ తగ్గించాలని, సంప్రదాయేతర విద్యుత్ కొనుగోలుపై జరిమానాను మినహాయించాలని, సంప్రదాయేతర విద్యుత్ నిర్వహణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని వినతిపత్రాలు సమర్పించినా కేంద్రం కరుణించలేదు. తాజా బడ్జెట్‌పై రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు సూక్ష్మ పరిశీలన చేశారు. ఏ శాఖ ద్వారా కూడా తెలంగాణ ప్రత్యక్ష ప్రయోజనాలు పొందే పథకాలు, కార్యక్రమాలు కనిపించలేదు. పరోక్ష ప్రయోజనాలను అన్వేషించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని అధికారులు తెలిపారు.



## రేవంత్‌రెడ్డి సర్కారు

# 'హనీమూన్' ముగిసింది

### రుణమాఫీ పూర్తయినట్లు నిరూపిస్తే

### రాజకీయాల నుంచి వైదొలగుతా: కేటీఆర్

**పరిగి, (ప్రభాత సూర్యుడు):** రేవంత్‌రెడ్డి సర్కారు హనీమూన్ కాలం ముగిసిందని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ ఎద్దేవా చేశారు. వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండలం దాస్యానాయక్ తండాలో సేవాలాల్ సేన ఆధ్వర్యంలో ఏర్పాటైన అంబేడ్కర్ విగ్రహాన్ని మాజీ ఎమ్మెల్యే కె.మహేశ్‌రెడ్డితో కలిసి కేటీఆర్ శనివారం ఆవిష్కరించారు. పూర్తిస్థాయిలో రుణమాఫీ జరిగినట్లు నిరూపిస్తే.. తాను శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పుకొంటానని సవాల్ విసిరారు. సీఎం సొంతూరికి లేదా పరిగి ఎమ్మెల్యే స్వగ్రామం శివారెడ్డిపల్లికి వస్తా.. అమలు చేసిన హామీలు చూపించాలని డిమాండ్ చేశారు. 'మీరు (సీఎం) వచ్చినా రాకపోయినా కొడంగల్‌కు దండయాత్రగా వెళ్తాం. కేసీఆర్‌కు, రేవంత్‌కు పోలికే లేదు. కేసీఆర్ అంటే ఒక హిస్టరీ.. రేవంత్ అంటే ఒక లాటరీ. తెలంగాణ రాష్ట్రం ఉన్నంత కాలం కేసీఆర్ పేరుంటుంది. సమయం వచ్చినపుడు కేసీఆర్ బయటకు వస్తారు. 71 ఏళ్ల కేసీఆర్‌ను కర్రసాయం లేకుండా అసెంబ్లీకి రమ్మంటున్నారు. మీకు దమ్ముంటే ఎలాంటి సెక్యూరిటీ లేకుండా లగచర్లకు రావాలి. తులం బంగారం, స్కూటీలు, ఉపకార వేతనాలు, రైతుబంధు, ఇవేవీ అమలు కాలేదు. చివరకు సఫాయి సిబ్బందికి కూడా వేతనాలు పడటం లేదు. భారాస పాలనలో పదేళ్లపాటు అభివృద్ధిని, సంక్షేమాన్ని జోడెద్దుల మాదిరిగా ముందుకు తీసుకువెళ్లాం. కాంగ్రెస్ ప్రభుత్వం మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డిని జైలుకు పంపింది. ప్రజల కోసం చేసే పోరాటంలో కేసులకు భయపడేది లేదు' అని కేటీఆర్ స్పష్టం చేశారు. లగచర్ల కేసులో బెయిల్‌పై విడుదలైన సురేష్, గోపాల్‌నాయక్‌లను సత్కరించారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు మహమూద్ అలీ, శ్రీనివాస్‌గౌడ్, సబితారెడ్డి, ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, ఎమ్మెల్సీలు శంభీపూర్ రాజు, నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మహేశ్‌రెడ్డి, ఆనంద్, నరేందర్‌రెడ్డి, రోహిత్‌రెడ్డి, బాల్కసుమన్, పార్టీ నాయకుడు ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్, సేవాలాల్ సేన వ్యవస్థాపకుడు సంజూనాయక్ తదితరులు పాల్గొన్నారు.

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

## సంపాదకీయం EDITORIAL



## అదరగొట్టిన అమ్మాయిలు

### అండర్ -19 టీ20 వరల్డ్ కప్ ఫైనల్‌లో భారత్ ఘన విజయం

వుమెన్స్ అండర్-19 టీ20 వరల్డ్ కప్‌లో భారత్ ఘన విజయం సాధించింది. ఈ విజయంతో వరుసగా రెండోసారి అండర్ 19 వరల్డ్ కప్‌లో టీమిండియా గెలుపొందింది. ఆదివారం సౌతాఫ్రికాతో జరిగిన ఫైనల్‌లో భారత్ 9 వికెట్ల తేడాతో విజయం సాధించి విశ్వవిజేతగా నిలిచింది. సఫారీ జట్టు నిర్దేశించిన 83 పరుగుల లక్ష్యాన్ని, టీమిండియా అమ్మాయిలు 11.2 ఓవర్లలో 1 వికెట్ కోల్పోయి ఛేదించారు. గొంగడి త్రిష 33 బంతుల్లో 44 పరుగులు (8ఐ4) చేసి నాటౌట్‌గా నిలిచింది. అంతకుముందు బ్యాటింగ్ చేసిన సౌతాఫ్రికా నిర్ణీత 20 ఓవర్లలో 82 పరుగులకు ఆలౌటైంది. భారత బౌలర్ల విజృంభనతో సఫారీ జట్టు విలవిల్లాడింది. మికీ వాన్ (23 పరుగులు)టాప్ స్కోరర్. నలుగురు ప్లేయర్లు పరుగుల  ఖాతా తెరవకుండానే పెవిలియన్ చేరారు. భారత జట్టు బౌలర్లలో త్రిష 3, పరునిక, ఆయూషి, వైష్ణవి తలో 2, షబ్నమ్ 1 వికెట్ తీశారు. ఈ టోర్నీలో తెలంగాణ అమ్మాయి గొంగడి త్రిష అద్భుతంగా రాణించింది. బ్యాటింగ్, బౌలింగ్‌లో దుమ్మురేపింది. ఈ టోర్నీలో సెంచరీ బాదేసింది. ఫైనల్‌లోనూ మూడు వికెట్లతో రాణించి, విజయానికి కారణమై అందరి దృష్టిని ఆకర్షించింది. ఇక ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్‌గా, ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా గొంగడి త్రిష నిలిచింది.

# డిన్నర్ పే 'చర్చ'



**హైదరాబాద్‌లోని ఓ హెూటల్‌లో ఇటీవల కలిసిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు**
**డిన్నర్ చేద్దామంటూ సన్నిహిత ఎమ్మెల్యేలకు ఉమ్మడి పాలమూరు జిల్లా ఎమ్మెల్యే ఆహ్వానం**
**డిన్నర్‌లో భాగంగా పిచ్చాపాటి కబుర్లు..మంత్రులకు నిధులెక్కువ ఎలా వెళతాయంటూ చర్చ**
**ఓ మంత్రి తన వ్యవహార శైలితో పార్టీకి చెడ్డపేరు తెస్తున్నారన్న పాలమూరు ఎమ్మెల్యే**
**ఎమ్మెల్యేల డిన్నర్‌పై రాష్ట్ర ప్రభుత్వానికి ఇంటెలిజెన్స్ నివేదిక**

హైదరాబాద్, (ప్రభాత సూర్యుడు): రాష్ట్ర కాంగ్రెస్‌లో ఇప్పుడు 'డిన్నర్ పే చర్చ'హాట్‌టాపిక్‌గా మారింది. ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన ఓ యువ ఎమ్మెల్యే తన సన్నిహిత ఎమ్మెల్యేలకు డిన్నర్ ఇవ్వడం, ఆ డిన్నర్‌కు వెళ్లిన ఎమ్మెల్యేలు పలు వివాదాస్పద అంశాలపై చర్చించడంతో కాంగ్రెస్ పార్టీలో ఏదో జరిగిపోతుందనే చర్చ రాజకీయవర్గాల్లో జరుగుతోంది. ఈ ఎమ్మెల్యేల డిన్నర్‌పై ఇంటెలిజెన్స్ నివేదిక ఇవ్వడంతో రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు కూడా అప్రమత్తమయ్యారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో నిర్వహించిన సుదీర్ఘ భేటీలో ఈ అంశం కూడా చర్చకు వచ్చిందని సమాచారం.

### మనం లేకపోతే.. వాళ్లున్నారా ?

ఆ ఎమ్మెల్యే ఆహ్వానం మేరకు హైదరాబాద్‌లోని ఓ హెూటల్‌లో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఐదారుగురు ఎమ్మెల్యేలు ఇటీవల డిన్నర్‌కు వెళ్లారు. ఈ డిన్నర్‌కు వెళ్లిన ఓ ఎమ్మెల్యే కథనం ప్రకారం.. డిన్నర్‌లో భాగంగా ఎమ్మెల్యేలు, మంత్రుల గురించి చర్చించుకున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పరిపాలన, మంత్రుల పనితీరు, ఎమ్మెల్యేలకు ఇస్తున్న నిధులు, మంత్రులతో సఖ్యత, ఓ కీలకశాఖకు చెందిన మంత్రి వ్యవహారశైలి తదితర అంశాలపై వారు మాట్లాడుకున్నారు.

మంత్రులు తమ నియోజకవర్గాలకు వేల కోట్ల రూపాయల నిధు లు తీసుకెళుతున్నారని, ఎమ్మెల్యేలకు మాత్రం నిధుల కేటాయింపులో ప్రాధాన్యం ఇవ్వడం లేదని ఓ ఎమ్మెల్యే ఈ సందర్భంగా ప్రస్తావించారు. అసలు ఎమ్మెల్యేలు లేనిదే మంత్రులు ఎక్కడి నుంచి వస్తారని, ఎమ్మెల్యేలను పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నారని ఆ ఎమ్మెల్యే వ్యాఖ్యానించినట్టు తెలిసింది. పాలమూరు జిల్లాకు చెందిన ఓ ఎమ్మెల్యే ప్రభుత్వంలోని కీలకశాఖకు చెందిన మంత్రి గురించిన అంశాన్ని లేవనెత్తారు. విచ్చలవిడిగా ఆయన తన వ్యవహార శైలితో పార్టీకి చెడ్డపేరు తెస్తున్నారని, ఆయనపై తన పోరాటాన్ని ఆపేది లేదని, ఈ విషయంలో ఎంతవరకైనా వెళతానని ఆ ఎమ్మెల్యే వ్యాఖ్యానించినట్టు తెలిసింది. కాంగ్రెస్ ప్రజాపాలనలో అన్ని వర్గాలకు న్యాయం చేసేందుకు ప్రయత్నం జరుగుతోందని, ఈ తరుణంలో పార్టీని, ప్రభుత్వాన్ని క్రమశిక్షణగా ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరముందని వారు మాట్లాడుకున్నారు.

### విభేదాలు రానివ్వొద్దన్న సీఎం !

కాగా, ఎమ్మెల్యేల డిన్నర్ వ్యవహారం నిఘా వర్గా ల ద్వారా సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి వెళ్లినట్టు తెలిసింది. శనివారం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో జరిగిన మంత్రులతో భేటీలో ఈ అంశాన్ని ప్రస్తా వించినట్టు సమాచారం. ఎమ్మెల్యేలతో విభేదాలు రానివ్వొద్దని, వారితో గ్యాప్ రావడం ద్వారా పార్టీకి, ప్రభుత్వానికి నష్టం జరుగుతుందని, ఇన్‌చార్జ్ మంత్రులు ఆయా జిల్లాల ఎమ్మెల్యేలను సమన్వయం చేసుకుంటే బాగుంటుందని సూచించినట్టు సమాచారం. ప్రభుత్వానికి, పార్టీకి మధ్య కూడా సమన్వయం అవసరమని సీఎం రేవంత్ మంత్రులకు దిశానిర్దేశం చేసినట్టు తెలిసింది.

## 'ఏ ++' గుర్తింపు కోసం

# న్యాక్ బృందానికి లంచాలు

**కేఎల్ వర్సిటీ యాజమాన్యంపై సీబీఐ కేసు**
**న్యాక్ బృందంలోని సభ్యులపై కూడా**
**10 మంది అరెస్టు**
**దేశవ్యాప్తంగా 20 చోట్ల తనిఖీలు**
**లంచంగా ఇచ్చిన సొత్తు స్వాధీనం**




అమరావతి, (ప్రభాత సూర్యుడు): గుంటూరు జిల్లా వడ్డేశ్వరంలోని కేఎల్ విశ్వవిద్యాలయానికి 'ఏ ౦౦' గుర్తింపు పొందేందుకు న్యాక్ బృందానికి లంచాలు ఇచ్చిన ఆ సంస్థ యాజమాన్యంపైన, తీసుకున్న సభ్యులపైనా సీబీఐ కేసు నమోదు చేసింది. మొత్తం 14 మందిని నిందితులుగా చేర్చింది. కోనేరు లక్ష్మయ్య ఎడ్యుకేషన్ ఫౌండేషన్ (కేఎల్‌ఈఎఫ్) ప్రెసిడెంట్, ఇతర ప్రతినిధులతోపాటు న్యాక్ తనిఖీ బృందంలోని మొత్తం 10 మంది సభ్యులను నిందితులుగా పేర్కొంది. 10 మందిని అరెస్టు చేసింది. కేఎల్‌యూ యాజమాన్య ప్రతినిధులతో పాటు దేశంలోని ప్రఖ్యాత విశ్వవిద్యాలయాలకు చెందిన ప్రొఫెసర్లు ఇందులో ఉండటం సంచలనం సృష్టించింది. దిల్లీ, విశాఖపట్నం నుంచి వచ్చిన సీబీఐ బృందాలు.. శనివారం ఉదయం విజయవాడ గవర్నర్‌పేటలోని కేఎల్‌యూ పరిపాలన భవనం, వడ్డేశ్వరంలోని క్యాంపస్‌లో సోదాలు చేపట్టాయి. శనివారం రాత్రి 10 గంటల వరకూ తనిఖీలు కొనసాగుతూనే ఉన్నాయి.

### నగదు, బంగారం రూపంలో లంచాలు...

న్యాక్ బృందం 3 రోజులుగా వడ్డేశ్వరంలోని కేఎల్‌యూ ప్రమాణాలను పరిశీలిస్తోంది. 'ఏ౦౦' రేటింగ్ కోసం యూనివర్సిటీ యాజమాన్యం నగదు, బంగారం, ల్యాప్‌టాప్‌లు, సెల్‌ఫోన్ల రూపంలో న్యాక్ బృందానికి లంచాలు ఇచ్చింది. దీనిపై సీబీఐకి ఫిర్యాదులు అందడంతో.. కేసు నమోదు చేసి, వెంటనే రంగంలోకి దిగింది. ఆఘమేఘాలపై దిల్లీ నుంచి వచ్చిన బృందాలు తనిఖీలు చేపట్టాయి. చెన్నై, బెంగళూరు, విజయవాడ, పాలము, సంబల్‌పూర్, భోపాల్, బిలాస్‌పూర్, గౌతమ్ బుద్ధనగర్, న్యూదిల్లీలోని 20 చోట్ల న్యాక్ బృంద సభ్యుల నివాసాలు, కార్యాలయాల్లో శనివారం ఏకకాలంలో సోదాలు చేశాయి. రూ.37 లక్షల నగదు, 6 ల్యాప్‌టాప్‌లు, ఒక ఐ ఫోన్ 16 ప్రో స్వాధీనం చేసుకున్నాయి.

### అరెస్టయిన 10 మంది వీరే..

కేఎల్‌యూ యాజమాన్య ప్రతినిధులు

1. జి.పి.సారథి వర్మ, వైస్ ఛాన్సలర్, కేఎల్‌ఈఎఫ్
2. కోనేరు రాజ హరీన్, వైస్ ప్రెసిడెంట్, కేఎల్‌ఈఎఫ్
3. ఎ.రామకృష్ణ, డైరెక్టర్, కేఎల్‌యూ, హైదరాబాద్ క్యాంపస్


### న్యాక్ బృందంలో సభ్యులుగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగులు

4. సమరేంద్ర నాథ్ సాహ, ఛైర్మన్, న్యాక్ తనిఖీ బృందం, వీసీ, రామచంద్ర చంద్రవంశీ విశ్వవిద్యాలయం
5. రాజీవ్ సిజిరియా, ప్రొఫెసర్, జేఎన్‌యూ, దిల్లీ, న్యాక్ తనిఖీ బృందం సభ్య సమన్వయకర్త
6. డా.డి.గోపాల్, డీన్, భారత్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లా.
7. రాజేశ్ సింగ్‌పవర్, డీన్, జగ్రాన్ లేక్ సిటీ విశ్వవిద్యాలయం, భోపాల్,
8. మానస్ కుమార్ మిశ్రా, డైరెక్టర్, జీఎల్ బజాజ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్
9. గాయత్రి దేవరాజ, ప్రొఫెసర్, దేవనగరి విశ్వవిద్యాలయం
10. డా.బులు మహారాణా, ప్రొఫెసర్, సంబల్‌పూర్ విశ్వవిద్యాలయం

### అరెస్టైన వారు కాకుండా మిగతా నిందితులు..

ఏ1: కోనేరు సత్యనారాయణ, ప్రెసిడెంట్, కేఎల్‌ఈఎఫ్
ఏ5: డా.ఎల్.మంజునాథరావు, మాజీ డిప్యూటీ సలహాదారు, న్యాక్
ఏ6: ఎం.హనుమంతప్ప, ప్రొఫెసర్, డైరెక్టర్, బెంగళూరు విశ్వవిద్యాలయం
ఏ7: ఎం.శ్యామ్‌సుందర్, సలహాదారు, న్యాక్, బెంగళూరు.

# ఛత్తీస్‌గఢ్ అడవుల్లో ఎదురుకాల్పులు!



కొత్తగూడెం (ప్రభాత సూర్యుడు): ఛత్తీస్‌గఢ్‌లోని కాంకేర్ - నారాయణ్‌పూర్ జిల్లాల సరిహద్దుల్లో మాడ్ ఏరియా కమిటీ మావోయిస్టులు సమావేశమయ్యారనే సమాచారంతో భద్రతా దళాలు సెర్చ్ ఆపరేషన్ నిర్వహిస్తున్నాయి. ఆదివారం కోయిలాబేడ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పానీదోబిర్ అడవుల్లో భద్రతాదళాలపై మావోయిస్టులు కాల్పులు జరపగా, జవాన్లు ఎదురుకాల్పులు ప్రారంభించారు. కాల్పులు కొనసాగుతున్నట్టు బస్తర్ ఐజీ సుందర్‌రాజ్ పాటిలింగం వెల్లడించారు. ఈ ఘటనలో ఎంతమంది మృతిచెందారనే విషయంపై పోలీస్ ఉన్నతాధికారులు స్పష్టత ఇవ్వాల్సి ఉంది.

### మావోయిస్టుల కుట్ర భగ్నం..

భద్రతా దళాలను టార్గెట్ చేస్తూ మావోయిస్టులు అమర్చిన మందుపాతరను జవాన్లు నిర్వీర్యం చేశారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా సీతాపూర్-ఉసుర్ మార్గంమధ్యలో రోడ్డుని తవ్వి మావోయిస్టులు మందుపాతరలు అమర్చారు. భద్రతాదళాలు గుర్తించి 25కేజీల కంటైనర్‌లో పాతిపెట్టిన ఇంప్రోవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైస్ (ఐఈడీ)ని తొలగించారు. ఈ మందుపాతరకు కార్డెక్స్ వైర్‌ను అనుసంధానం చేస్తూ రోడ్డు నుంచి 400మీటర్ల వరకు అమర్చారు. రోడ్డు గుంతలా ఉండడంతో వైరుని గమనించిన జవాన్లు మందుపాతరను జేసీబీతో తవ్వించి, నిర్వీర్యం చేశారు.



## చివరి టీ-20లో ఇంగ్లండ్‌పై టీం ఇండియా

# భారీ విజయం!

ఇంగ్లండ్, టీం ఇండియా మధ్య ముంబైలోని వాంఖడే స్టేడియంలో ఆదివారం జరుగుతున్న చివరి-ఐదో టీ20 మ్యాచ్‌లో 248 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ బ్యాటర్లు భారత్ బౌలర్ల దాటికి విలవిలలాడారు. క్రీజ్‌లో నిలవలేక పోయారు. ఫలితంగా కేవలం 10.3 ఓవర్లలోనే 97 పరుగులకు ఆలౌట్ అయ్యారు. దీంతో 150 పరుగుల తేడాతో టీం ఇండియా భారీ విజయాన్ని నమోదు చేసింది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను 3-2 తేడాతో సొంతం చేసుకుంది.

భారీ విజయ లక్ష్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఓపెనర్ ఫిల్ సాల్ట్ 23 బంతుల్లో ఏడు ఫోర్లు, మూడు సిక్సర్లతో 55 పరుగులు చేసి మెరుపులు మెరిపించినా ఉపయోగం లేకపోయింది. మరో ఓపెనర్ బెన్ డకెట్ డకౌట్ అయ్యాడు. జాకబ్ బెతెల్ పది పరుగులు చేసి శివమ్ దూబే బౌలింగ్‌లో క్లీన్ బౌల్డ్ అయ్యాడు. మిగతా బ్యాటర్లెవరూ క్రీజ్‌లో నిలవలేక పోయారు. సారథి జాస్ బట్లర్ కేవలం ఏడు పరుగులకు వరుణ్ చక్రవర్తి బౌలింగ్‌లో తిలక్ వర్మకు క్యాచ్ ఇచ్చి పెవిలియన్ బాట పట్టాడు. హ్యారీ బ్రూక్ రెండు, లియాం లివింగ్‌స్టోన్ తొమ్మిది పరుగులు, బ్రైడాన్ కార్స్ మూడు, అదిల్ రషీద్ ఆరు పరుగులు చేశారు. భారత్ బౌలర్లలో మహ్మద్ షమీ మూడు, వరుణ్ చక్రవర్తి, శివమ్ దూబె, అభిషేక్ శర్మ రెండేసి వికెట్ల చొప్పున తీసుకున్నారు.

అంతకు ముందు ఇంగ్లండ్ జట్టు ముందు టీం ఇండియా 248 పరుగుల విజయ లక్ష్యాన్ని నిలిపింది. తొలుత టాస్ గెలుచుకున్న ఇంగ్లండ్ ఫీల్డింగ్ ఎంచుకున్నది. భారత్ ఓపెనర్లు సంజూ శాంసన్, అభిషేక్ శర్మ బ్యాటింగ్‌కు దిగినా సంజూ శాంసన్ ఏడు బంతుల్లో ఒక ఫోర్, రెండు సిక్సర్లతో 16 పరుగులు చేశాడు. మార్క్ వుడ్ బౌలింగ్‌లో జోఫ్రా అర్చర్‌కు క్యాచ్ ఇచ్చి పెవిలియన్ దారి పట్టాడు. వన్ డౌన్ బ్యాటర్ తిలక్ వర్మ, సారథి సూర్య కుమార్ యాదవ్ వెంటవెంటనే ఔటయినా అభిషేక్ శర్మ క్రీజ్‌లో నిలుచుండి పోయాడు.

37 బంతుల్లో స్పీడ్‌గా సెంచరీ పూర్తి చేసుకున్న అభిషేక్ శర్మ నిలకడగా ఆడి స్కోర్ పెంచాడు. మొత్తం 54 బంతుల్లో 135 పరుగులు చేసి అదిల్ రషీద్ బౌలింగ్‌లో జోఫ్రా ఆర్చర్‌కు క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. శివం దూబె 13 బంతుల్లో 30 పరుగులు, అక్సర్ పటేల్ 15 పరుగులుచేశారు. ఇంగ్లండ్ బౌలర్లలో బ్రైడన్ కార్స్ మూడు, మార్క్ వుడ్ రెండు, జోఫ్రా ఆర్చర్, జామీ ఓవర్‌టన్, అదిల్ రషీద్ చెరో వికెట్ తీశారు. తొలుత టీం ఇండియా నిర్ణీత 20 ఓవర్లలో తొమ్మిది వికెట్లు కోల్పోయి 247 పరుగులు చేసింది.

# అభిషేక్ శర్మ మహెూగ్రరూపం

### 37 బంతుల్లోనే శతకం



ముంబై వేదికగా ఇంగ్లండ్‌తో జరుగుతున్న ఐదో టీ20లో టీమిండియా ఓపెనర్ అభిషేక్ శర్మ శివాలెత్తిపోయాడు. ఈ మ్యాచ్‌లో అభిషేక్ కేవలం 17 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. భారత్ తరఫున టీ20ల్లో యువరాజ్ సింగ్ (12 బంతుల్లో) తర్వాత ఇదే వేగవంతమైన హాఫ్ సెంచరీ. అభిషేక్ ఆకాశమే హద్దుగా చెలరేగడంతో ఈ మ్యాచ్‌లో భారత్ ఓ భారీ రికార్డు సాధించింది. పవర్ ప్లేల్లో (తొలి 6 ఓవర్లలో) తమ అత్యధిక స్కోర్ నమోదు చేసింది. అభిషేక్ విధ్వంసం ధాటికి భారత్ తొలి 6 ఓవర్లలో వికెట్ నష్టానికి 95 పరుగులు చేసింది. ఈ మ్యాచ్‌కు ముందు పవర్ ప్లేల్లో టీమిండియా అత్యధిక స్కోర్ 82/2గా ఉండింది. 2021లో స్కాట్లాండ్‌పై భారత్ ఈ స్కోర్ చేసింది.

### టీ20 పవర్ ప్లేల్లో భారత్ అత్యధిక స్కోర్లు

95/1 ఇంగ్లండ్‌పై (2025)
82/2 స్కాట్లాండ్‌పై (2021)
82/1 బంగ్లాదేశ్‌పై (2024)
78/2 సౌతాఫ్రికాపై (2018)

కాగా, ఈ మ్యాచ్‌లో అభిషేక్ విధ్వంసం హాఫ్ సెంచరీతో ఆగలేదు. హాఫ్ సెంచరీ తర్వాత అతను మరింత చెలరేగిపోయాడు. కేవలం 36 బంతుల్లో 5 ఫోర్లు, 10 సిక్సర్ల సాయంతో 99 పరుగులు చేసి అజేయంగా ఉన్నాడు. అతనికి జతగా సూర్యకుమార్ యాదవ్ (2) క్రీజ్‌లో ఉన్నాడు. 10 ఓవర్ల తర్వాత భారత్ స్కోర్ 143/2గా ఉంది. భారత ఇన్నింగ్స్‌లో సంజూ శాంసన్ 7 బంతుల్లో 16, తిలక్ వర్మ 15 బంతుల్లో 24 పరుగులు చేసి ఔటయ్యారు. తిలక్ కాస్త పర్వాలేదనిపించగా.. శాంసన్ వరుసగా ఐదో ఇన్నింగ్స్‌లో తక్కువ స్కోర్‌కే ఔటయ్యాడు.

### 37 బంతుల్లో శతక్కొట్టిన అభిషేక్

హాఫ్ సెంచరీ తర్వాత పేట్రేగిపోయిన అభిషేక్ శర్మ 37 బంతుల్లో 5 ఫోర్లు, 10 సిక్సర్ల సాయంతో సెంచరీ పూర్తి చేశాడు. టీ20ల్లో భారత్ తరఫున ఇది రెండో వేగవంతమైన శతకం. టీ20ల్లో భారత్ తరఫున వేగవంతమైన సెంచరీ రికార్డు రోహిత్ శర్మ పేరిట ఉంది. హిట్‌మ్యాన్ 2017లో శ్రీలంకపై 35 బంతుల్లోనే శతక్కొట్టాడు. ఓవరాల్‌గా టీ20ల్లో ఫాస్టెస్ట్ సెంచరీ రికార్డు ఎస్టోనియాకు చెందిన సాహిల్ చౌహాన్ పేరిట ఉంది. గతేడాది చౌహాన్ సైప్రస్‌పై కేవలం 27 బంతుల్లోనే సెంచరీ చేశాడు. 15 ఓవర్ల తర్వాత టీమిండియా స్కోర్ 194/5. అభిషేక్ (108), రింకూ సింగ్ (1) క్రీజ్‌లో ఉన్నారు.

Printed, Published and Owned by CHERUKU UPENDER, Printed at Ratna Graphics, H.No. 2-3-703/7, Tirumala Nagar Colony, Police Lane, Amberpet, Hyderabad - 500 013 Telangana.
Editor: CHERUKU UPENDAR, Publication at HAMSA PUBLICATIONS, H.No: 7-83/2, Hanuman Nagar Colony, Kuntloor, Abdullapurmet Mandal, Hayath Nagar, Pin:501505,
Rangareddy District/Hyderabad City, Telangana. E-mail:upendrabbk@gmail.com RNI: TELTEL12215